# బుజ్జిబాబుకి ప్రమోషనొచ్చింది...

-దూరి వెంకటరావు



బుజ్జిబాబుకి ప్రమోషనొచ్చింది. ఆషామాషీ ప్రమోషను కాదు. ఆఫీసరు ప్రమోషను హఠాత్తుగా బాస్‌కి గుండెపోటొచ్చి గుటుక్కుమనడంతో అదృష్టం తనని వరించింది. అనుకోకుండా వళ్ళో వాలి పడ్డ ఈ ప్రమోషనుకు పొంగిపోవాలో కుంగిపోవాలో తెలీడం లేదు. ఇంతవరకు అందిరిలో ఒకడిగా వున్న తనను సహోద్యుగులు ఇకముందు బాస్‌గా గుర్తిస్తారో లేదోనన్న శంకే అందుకు కారణం. హోదా వెలగబెట్టలంటే ఖర్చుకు వెనుకాడకూడదు. పైసా పోతే ప్రాణం పోయినట్లు ఫీలయిపోయే బుచ్చిబాబు ఎలా నెగ్గుకొస్తాడో!

సీట్లో కూర్చున్న తొలిరోజు...

స్టాఫంతా వచ్చి, అభినందనలు తెలిపారు. అయితే వారి కళ్ళల్లో తను అధికారినన్న

భావన మాత్రం ఏ కోశానా కానరాకపోవడంతో తెగదిగాలు పడిపోయాడు. అప్పటినుంచి తన ఆధిక్యతను చాటుకోవడం కోసం నానా తిప్పలు పడ్డాడు. చొక్కా పాతదే అయినా ప్యాంట్లో దోపుకున్నాడు. పెట్లో అడుగున పడివున్న పాత మెడగోచీని బయటకు లాగాడు. కాలం చెల్లడంతో అది స్ప్రింగులా రుమ్మచుట్టుకు పోతుంది. అయినా వదల్లేదు. చెంబు ఇస్త్రీతో సాగదీసి మరీ మెడకు చుట్టుకున్నాడు. నిన్నటిదాకా ఆఫీసుకు సైకిలు మీద వచ్చాడు. ఇప్పుడు బండి ఉంటే బావుండుననిపించింది. అనిపిస్తే సరా, దానికోసం వేలకు వేలు గుమ్మరించొద్దూ! అంత సాహసం చెయ్యలేక ఆటోలో వెళ్ళాలని నిశ్చయించుకున్నాడు.

ఇంటినుంచి ఆఫీసుకు మూడు కోసిళ్ళుంటుంది. పాతికిస్తేగాని ఆటోవాడు రాడు. డబ్బులు తగ్గుతాయని కొంతదూరం నడిచివెళ్లి ఆటో ఎక్కాడు. బండిని గేటువరకు పోనిమ్మన్నాడు. ఆఫీసులో అడుగుపెట్టేంతవరకు ఇంజనాపొద్దని డ్రైవర్ని ఆదేశించాడు.

బుచ్చిబాబు వంక అదోలా చూసాడు ఆటోవాడు. తను ఆటోలో దిగిన సంగతి అందరికీ తెలియడం కోసం వాళ్ళ దృష్టి ఆటోమీద మరలడం కోసం అలా అన్నాడని పాపం వాడికి తెలీదు. అయినా బుచ్చిబాబు వాలకం చూసి ఏమనుకున్నాడో ఏమో చార్జీ అదనంగా ఐదు రూపాయలు అవుతుందన్నాడు. మరి ఆ మాత్రానికి అంత దూరం నడిచి ఆటో ఎక్కడం దేనికి అనిపించింది బుచ్చిబాబుకి. అంతే, అక్కర్లేదని చెప్పి దభీమని ఆటోలోంచి దూకేశాడు.

ఫైలు అందుకోడానికి అటెండరు వస్తాడేమోనని చూస్తే ఎక్కడా వాడి జాడేలేదు. చేసేదేంలేక తలవంచుకుని తన గదిలోకెళ్లిపోయాడు. స్టాఫ్ తనని చూసీ చూడనట్లు వ్యవహరించడంతో ఉక్రోషంతో ఊగిపోయాడు. ఏం చెయ్యాలో తెలీక నెత్తి బాదుకున్నాడు. ఛ... ఉన్నచోట ప్రమోషనొస్తే ఇలాగే ఉంటుందనుకున్నాడు. అలా అనుకుని చేతులు ముడుచుకుని కూర్చోలేడు. తనంటే ఏమిటో అందరికీ తెలియజెప్పాలి. అందుకు ముందుగా తన నడతలో మార్పు అనివార్యమని భావించాడు.

అంతలో పళ్ళికిలించుకుంటూ వచ్చి 'సారీ సార్ మీరింకా రాలేదనుకున్నాను' నక్క వినయం నటించాడు నారాయణ. వాణ్ణి చూసేసరికి వళ్లు మండింది బుచ్చిబాబుకి. ఎలాగో నిగ్రహించుకుని 'వెళ్ళి మంచినీళ్ళు పట్రా' అన్నాడు ఏదో పని పురమాయించాలని.

సాయంత్రం ఐదవుతూనే స్టాఫ్ ఒక్కొక్కరూ చెప్పాపెట్టకుండా చల్లగా జారుకున్నారు.

ఒంటరిగా మిగిలాడు బుచ్చిబాబు.

'ఆటో పిలవమంటారా' అడిగాడు నారాయణవచ్చి.

'ఇంకా నయం ఆటో పట్టుకొచ్చేసి జేబుకి చిల్లు పెట్టలేదు' అనుకుని 'ఇప్పుడప్పుడే

వెళ్ళను నీకు పనుంటే పో. తలుపు వెయ్యడానికి నైట్‌వాచరున్నాడులే" అన్నాడు కసిగా.

ఆ మాట కోసమే ఎదురుచూస్తున్న నారాయణ బతికించేడనుకుని ఊపిరి పీల్చుకున్నాడు. మాజీ బాస్‌కంటే ఇతగాడే నయం. చచ్చినోడు ఏలోకాన ఉన్నాడో గాని

ఓఉన్నన్నాళ్ళూ చంపుకు తిన్నాడు. పోయినోడికి ఓ దండం పెట్టేసి బుచ్చిబాబుని తెగ మెచ్చేసుకున్నాడు.

ఆ రోజు ఆదివారం.

ఆఫీసుకు సెలవవడం వల్ల ఇంట్లోనే ఉన్నాడు బుచ్చిబాబు.

"అలా గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోకపోతే రైతు బజారుకెళ్ళి కూరలు పట్టుకు రాకూడదు!" అంది అతడి అర్ధభాగం.

భాగ్యం మాటలకి చిర్రెత్తుకొచ్చింది.

"అయిందానికి కానిదానికి అన్నిటికి నేనేనా? పద్మను పంపించవచ్చు కదా!" అన్నాడు.

"చిన్న పిల్ల దానికి కూరల నాణ్యత ఏం తెలుస్తుంది చెప్పండి. మీరైతే..." ఏదో అనబోయింది.

"అది సరే. నేనిప్పుడు ఆఫీసర్ని అన్న సంగతి తెలిసే పని పురమాయిస్తున్నావా? నేను కూరలు మోసుకుంటూ రావడం ఎవరి కంటైనా పడితే నా పరువేంగాను? మళ్ళీ పదిమందిలో తలెత్తుకుని తిరగాలా వద్దా"

"మీరా మాటంటే గుర్తొచ్చింది మన ఎమ్ఆర్ఓ గారి భార్య భారతమ్మ లేదూ...'

"లేదా?! అయ్యో పాపం!" ఏడ్చినంత పనిచేశాడు బుచ్చిబాబు.

"అదేంటండి ఆ అపశకునం మాట. ఆవిడ హాయిగా నిక్షేపంలా వుంటే...'

"అయితే ఏమిటట"

"ఆవిడ తనకేం కావలసొచ్చినా ఎంచక్కా ఆఫీసు ప్యూన్ చేత తెప్పించుకుంటూ

ఉంటుంది. వాడు ఆఫీసుకు ఎప్పుడు వెళతాడో తెలీదు. పొద్దస్తమాను వాళ్ళ కొంపలోనే అఘోరిస్తాడు. మీరూ ఉన్నారు ఏం లాభం? పేరుకు ఆఫీసరే ఒక్కరోజైనా మీ ఆఫీస్‌బోయ్‌ని ఇంటికి రప్పించారా? వాడిచేత ఏ పనైనా చేయించుకున్నారా?" మూతి విరుస్తూ అన్నది భాగ్యం.

"అదా నీ బాధ. ఆఫీసు బోయ్ చేత ఆఫీసు పని తప్ప సొంత పనులు చేయించుకోకూడదు. ఎవరో గడ్డి వేస్తే మనమూ అదే మెయ్యాలా?"

అర్ధాంగిని కన్విన్స్ చెయ్యడానికి అలా అన్నాడే గాని అసలు రహస్యం అది కాదు.

బోయ్‌కి డబ్బులిచ్చి పంపిస్తే వాడు అంతకు ఇంత అనొచ్చు నిత్యం వాడి చేత పనులు చేయించుకుంటే కొంప కొల్లేరైపోతుంది. అదీ అతడి భయం. పైగా నారాయణ కుర్రకుంక. అస్తమాను ఇంటికొస్తే వయసులో వున్న కూతురితో వెధవ్వేషాలు వేసినా వెయ్యచ్చు. అంచేత వాడిని గుమ్మం తొక్కనివ్వలేదు.

సుద్దులు మాబాగా చెబుతారు. ఆ నస ఆపి కూరలు తెప్పించే మార్గం చూడండి. మీరు వెళ్ళనంటే నేనే బయల్దేరాలి"

"వద్దులే నేనే మరో అవతారం ఎత్తుతాను. లోకకళ్యాణార్థం పరమాత్ముడెన్ని అవతారాలెత్తలేదు. ఆ బ్యాగు నా మొహాన కొట్టు" అని చెప్పి బీరువాలో ఉన్న పంచల చాపును బయటకు తీసాడు. ముందుచూపుతో దాచిపెట్టుకున్న విగ్గు తీసి తలకు తగిలించుకున్నాడు. నుదుట కుంకుమ వంటికి విభూతి దట్టంగా అద్దుకున్నాడు.

"ఈ దసరా వేషం దేనికండి" అన్నది భాగ్యం నోరు వెళ్ళబెడుతూ.

"ఇలా అయితే నన్నెవరూ గుర్తుపట్టలేరు" అన్నాడు బుచ్చిబాబు భార్య పట్టుకొచ్చిన బ్యాగందుకుంటూ.

"మీ తెలివి తెల్లారినట్లే ఉంది. కుక్కలు వెంటబడగలవ్ జాగ్రత్త"

భాగ్యం హెచ్చరికని తేలికగా తీసేస్తూ "వజ్రాయుధం లాంటి ఈ గొడుగు అండగా ఉండగా నీకు వలదు భయం. అవసరమైతే దీంతో ఓ బాదు బాదుతాన్లే" అనేసి కాళ్ళకు అడ్డుపడుతున్న పంచె చెంగును పైకెగదోసుకుంటూ రోడ్డున పడ్డాడు బుచ్చిబాబు.

"మీకు పుట్టిన బుద్ధే తప్ప ఈవతల వాళ్ళ మాట వినిపించుకోరు" సణుక్కుంటూ లోనికెళ్ళిపోయింది భాగ్యం.

'అయ్యా! తవరేనా దీక్షితులుగారంటే" అడిగాడు ఓ అపరిచిత వ్యక్తి పరుగెత్తుకుంటూ వచ్చి.

"ఉహుం" అన్నాడు బుచ్చిబాబు.

తన వేషధారణ పంతులుగారి మల్లె ఉన్నట్లుంది. లేకపోతే వాడెందుకలా సంబోధిస్తాడు" అనుకుని నవ్వుకున్నాడు లోలోపల.

"నన్ను పేరయ్య అంటారు. దీక్షితులు గారిక్కడ ఉంటారని దగ్గరుండి తీసుకురమ్మని మా గురూగారు పంపించారు. ఒకవేళ ఆయన దొరక్కపోతే ఇంకెవ రినైనా పట్టుకు రమ్మన్నారు. అదృష్టం బావుంది ఠక్కున మీరు దొరికారు. పదండి. అవతల అబ్దికానికి వేళవుతోంది".

పేరయ్య మాటలకు మొహం అదోలా బెట్టి "అబ్బే నాకెలా అవుతుంది. నేను ఇంటికెళ్ళాలి" అన్నాడు బుచ్చిబాబు.

"మీరు పెద్దమనసు చేసుకుంటే ఎందుకవదు? ఇప్పటికే బాగా అలస్యమైపోయింది. మీరేమనుకోపోతే ఆ కూరల సంచి నాకివ్వండి. వాటిని మీ ఇంట్లో పడేసిన తర్వాతే వెళదాం" బ్రతిమాలాడాడు పేరయ్య. బుచ్చి బాబు చేతిలో నుంచి సంచి లాక్కుంటూ.

"చూస్తుంటే వీడు వదిలేటట్టు లేదు. కొంపతీసి ఇంటికొచ్చాడో బండారం బయటపడిపోతుంది. ఈ విపత్తునుండి బయటపడాలంటే వాడితో వెళ్లడమే మంచిది. తన పిచ్చిగాని వెళితే ఏమైంది? పీకల వరకు మేసి రావడమే కదా! మంత్రం చదవడానికి వాళ్ళ గురూగారెలానూ ఉండనే ఉన్నారు. పొద్దున్నుంచి కాఫీ నీళ్ళు తప్ప మరేం పడకపోవటంతో కడుపు నకనకలాడుతోంది. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే తప్పేముంది? తనకు తాను సమాధానపరచుకుని "సరే పదండి" అన్నాడు.

ముందు పేరయ్య

వెనుక బుచ్చిబాబు

కొంతదూరం వెళ్ళాక పేరయ్య ఓ ఇంటి ముందు ఆగాడు.

అప్పుడే లోపలనుంచి బయటకొచ్చాడో పెద్ద మనిషి.

అతడిని చూసీ చూడటంతోనే బుచ్చిబాబు గుండె దడదడలాడింది. శరీరంలో నరాలన్నీ బిర్ర బిగుసుకుపోయాయి. మెదడు పని చేయడం మానేసింది. అతడెవరో కాదు. తన ఆఫీసులో పనిచేసే సీనియర్ గుమస్తా సత్యారావు. వాడు నిన్న పిత్రుకార్యం ఉందంటూ సెలవు పెట్టిన విషయం గుర్తొచ్చింది. "వీడు గాని తనను పోలిస్తే ఇంకేమైనా ఉందా?... మైగాడ్ ఆఫీసంతా టాంటాం చేసి పారేయడూ! ఇప్పటిదాకా పదిలంగా కాపాడుకొస్తున్న ప్రిస్టేజీ కాస్త గంగపాలవడం ఖాయం.... నో... ఎలాగైనా వీడి కన్నుగప్పి బయటపడాలి" అనుకుని కాళ్ళకు బుద్ధి చెప్పేలోపలే "రండి పంతులుగారూ, మీ కోసమే ఎదురు చూస్తున్నాం. సంశయించకండి. సంభావన దండిగానే ఉంటుంది" అన్నాడు సత్యారావు పరుగున వచ్చి.

తను భోక్తనన్న భ్రమలో ఉన్నాడు సత్యారావు. అంచేత ఈ పాత్రనిలా కంటిన్యూ చేయడమే మంచిదనిపించింది. వెంటనే ఏం సమాధానమివ్వాలో స్ఫురింపక 'పదండి' అన్నాడు.

తడి ఆరిపోయిన గొంతులోంచి అతి కష్టం మీద వెలువడిందామాట.

బుచ్చిబాబును మర్యాదగా లోనికి తీసుకెళ్ళి నూతి వద్ద చేతులు కాళ్ళు కడుక్కోమని

చెప్పి మడి తువ్వాలందించాడు.

వంట ఇంట్లోంచి వెలువడే పిండివంటల ఘుమఘుమలు బుచ్చిబాబు ముక్కుపుటాలను చేరి మత్తెక్కిస్తున్నాయి.

కాళ్ళు కడుక్కుందామని గబగబా నూతివద్దకెళ్ళాడు.

చప్టా పాకుడు పట్టి వుందేమో దభాలున జారి పడ్డాడు. తనకున్న విగ్గు కాస్త ఊడి ఆమడదూరం ఎగిరిపడింది.

"సార్ మీరా! నమ్మలేనన్నట్లుగా చూస్తూ అతడి చేయి పుచ్చుకుని పైకి లేవనెత్తాడు సత్యారావు.

అతడి కరస్పర్శకు వంటి మీద తేళ్ళు జెర్రులు ప్రాకుతున్నట్లనిపించింది. ఇంతవరకు ఎవరి కంట పడకూడదనుకున్నాడో వాళ్ళ కంటె పడిపోయాడు. దాంతో మరి వెనక్కి తిరిగి చూడకుండా బయటకు పరుగు లంఘించాడు.

విషయం ఆ నోట ఈ నోట విశ్వమంతా వ్యాపించింది.

మరునాడు ఆఫీసులో స్టాఫ్ ముసిముసిగా నవ్వుకోవడం గమనించి సిగ్గుతో కుంచించుకుపోయాడు. ముఖ్యంగా కంప్యూటర్ ఆపరేటరు కనక లక్ష్మి చూపులు అతడిని మరింతగా బాధించాయి. ఈ పరాభవాన్ని భరించలేనన్నట్లు గబగబా గదిలోకెళ్ళి తలుపులు మూసుకున్నాడు. కసిగా జుట్టు పీక్కున్నాడు. చొక్కా చింపేసుకున్నాడు. సొరుగు లోంచి కాగితం తీసి "అయ్యా! నాకీ ప్రమోషనొద్దు. నా మొర ఆలకించి ఉన్నపళంగా నా పాత సీటుకు ట్రాన్స్ఫర్ చేసి పుణ్యం గట్టుకోండి" అంటూ పై అధికారికి అర్జీ పెట్టుకున్నాడు.

(14-6-2008 ఆంధ్రభూమి దినపత్రిక)

